ప్రజాశక్తి

బుధవారం 28 ఆగస్టు 2024 | 5 | అనంతపురం

ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలి

ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కలెక్టరేట్ : ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టి యూరియా, డిఎపి కొరత లేకుండా రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని కామ్రేడ్ గణేనాయక్ భవనంలో ఉన్న రైతుసంఘం జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతు సేవాకేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉండకపోవడంతో రైతులు ప్రయివేట్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో వరినాట్లు ప్రారంభం కావడంతో కొన్ని ప్రాంతాల్లో ఎరువుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఇసుక దుమారం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇసుక ఇప్పుడు బంగారమైపోతోంది. సామాన్యులకు భారంగా మారిన ఇసుక కొంత మంది పాలిట వరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలోనూ దీని చుట్టూ రాజకీయాలు నడిచాయి. ప్రభుత్వమే స్వయంగా ఇసుక అమ్మినప్పటికీ నిర్ణయించిన ధరలు ఆకాశాన్ని అంటాయి. టిప్పరు ఇసుక ధర రూ.20 వేలకుపైగా ధర పలికింది. అది కూడా సరిగా దొరకని పరిస్థితులు నెలకన్నాయి. దీనిపై తెలుగుదేశం పార్టీ నిరసనలు చేపట్టింది. ఇప్పుడు కొత్తగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ఇసుక విధానంలో మార్పులు తీసుకొస్తున్నట్టు ప్రకటించింది. ఉచిత ఇసుక అని చెప్పినప్పటికీ తవ్వకం, లోడింగ్, రవాణా ఖర్చులకంటూ ధరలు నిర్ణయించింది. దీంతో గతంలోనున్న ధర కంటే కొద్దిగా తగ్గింది. టిప్పర్ ఇసుక రూ.16 వేల వరకు ప్రస్తుతం పలుకుతోంది.

అక్రమ ఇసుక రవాణాను అరికట్టేరా ?

గతంలో ప్రభుత్వ పరంగా ఇసుక డిపోల్లో ప్రభుత్వం అమ్మకాలు చేసేది. ఇది కాకుండా కొంత మంది అధికారాన్ని అడ్డుపెట్టుకుని అమ్మకాలు సాగించి పెద్దఎత్తున సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ ఇదే రకంగా ఇసుక ఆదాయ వనరుగా మారింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఇసుక అక్రమాలపై ప్రభుత్వం నిఘా పెట్టింది. అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లా కలెక్టర్ల చేత ఇసుక తవ్వకాలపై నివేదికలను కోరింది. ఉమ్మడి జిల్లాలోనూ ఇసుక తవ్వకాలపై నివేదికలను అందజేశారు. ఇప్పుడు ఆ తవ్వకాలపై విజిలెన్సు విచారణకు ఆదేశించినట్టు ప్రచారం నడుస్తోంది. భాగస్వామ్యులైన వైసిపి నేతల పాత్రను నిగ్గుతేల్చే పనిని చేపట్టినట్టు తెలుస్తోంది.

తాడిపత్రి పెన్నా తరలింపుపై ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం

తాడిపత్రిలో పెద్దపప్పూరుతోపాటు, తాడిపత్రి ప్రాంతంలోనూ పెన్నానది ఉంది. ఈ పరివాహక ప్రాంతంలో ఇసుక ఉంది. గత ప్రభుత్వ హయంలో అనుమతుల్లేకుండానే పెద్దపప్పూరు, ఉల్లికల్లు తదతర ప్రాంతాల్లో తవ్వకాలు సాగించినట్టు ఆరోపణలున్నాయి. ఇప్పుడు దీనిపైనా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ఇసుక తవ్వకాలు కొంత మంది అక్రమంగా సాగినట్టు ఆరోపణలున్నాయి. వీటిపై పోలీసు అధికారులు చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి వారి మద్దతుదారులు చెబుతున్నారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి కూడా దీనిపై ఒక వీడియోను విడుదల చేశారు. తనకు అప్తులుగానున్న వారే ఈ ఇసుక దందా సాగించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. వారంతా మానుకోవాలని కోరుతూ వీడియో విడుదల చేశారు. ప్రభుత్వపరంగా విచారణ కూడా సాగుతున్నట్టు ఆయన తెలిపారు.

తాడిపత్రిలో ఇసుక వార్

◆ పోలీస్ స్టేషన్ ఎదుట టిడిపి నాయకుల ధర్నా

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

సోమవారం రాత్రి తాడిపత్రి మండల పరిధిలోని పెన్నా నది పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్లను టిడిపి నాయకులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో టిడిపి నాయకులు అక్రమ ఇసుకదారుల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని టిడిపి శ్రేణులు సిఐ లక్ష్మీకాంత్ రెడ్డిని కోరారు. సిఐ కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహించడంపై టిడిపి శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. సిఐ తీరుపై ఎమ్మెల్యే జేసీ.అస్మిత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే ఇసుక అక్రమ తరలింపుదారులపై కేసు నమోదుకు సంబంధించి జెసితో మాట్లాడారు. ఈ సమయంలో సిఐ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో మంగళవారం నాడు రూరల్ పోలీస్ స్టేషన్ ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి, టిడిపి నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. డీఎస్పీ జనార్దన్ నాయుడు కలగజేసుకుని తెలుగుదేశం శ్రేణులు, ఎమ్మెల్యేకి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా నాయకులు ధర్నా విరమించలేదు. వర్షంలో సైతం పోలీసు స్టేషన్ ఎదుట బైటాయించి నిరసన కొనసాగించారు. ఎట్టకేలకు ఫోన్ ద్వారా సిఐ లక్ష్మీ కాంత్‌రెడ్డి ఎమ్మెల్యేతో మాట్లాడి క్షమాపణ చెప్పడంతో టిడిపి శ్రేణులు ధర్నాను విరమించుకున్నారు.

అస్మిత్‌రెడ్డితో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్ధన్‌నాయుడు

పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న టిడిపి శ్రేణులు

విద్యార్థి మృతిపై ఆందోళనలు

◆ హత్య అంటూ తల్లిదండ్రుల ఆరోపణ
◆ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నిరసన
◆ సర్ది చెప్పిన డీఎస్పీ ప్రతాప్

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

అనంతపురం నగరంలోని రాంనగర్ బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ విద్యార్థి తేజ మృతిపై తల్లిదండ్రులు, బంధువులు అనుమానాలు వ్యక్తం చేశారు. తమ కుమారుడిది హత్య అంటూ పోలీసులకు తెలిపారు. వాస్తవాలు నిగ్గు తేల్చాలని పట్టుబడుతూ అనంతపురం సర్వజన ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామానికి చెందిన లింగమయ్య, రాములమ్మ దంపతుల కుమారుడు తేజ సోమవారం తాను ఉంటున్న హాస్టల్లో అనుమానాస్పద స్థితిలో మతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం తేజ తల్లిదండ్రులు, బంధువులు పెద్ద ఎత్తున జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుమారుడిది ఆత్మహత్య కాదని ముమ్మాటికీ హత్యేనని ఆరోపించారు. తమ కుమారుడు మూడు రోజుల క్రితం ఫోన్ చేసి తనను కొందరు తోటి విద్యార్థులు కొడుతున్నారని, దిండుతో అదిమి చంపడానికి ప్రయత్నిస్తున్నాడని చెప్పాడన్నారు. తమ కుమారుడు చనిపోయిన సమయంలో అదే గదిలో ఉన్న ఓ విద్యార్థి పేరు చెప్పాడని, ఆ విద్యార్థికి చెందిన టవల్ మా అబ్బాయి మెడకు ఉందని తెలిపారు. తమ కుమారుని మరణం వెనుక ఉన్న వాస్తవాలను బహిర్గం చేయాలన్నారు. పోలీసులు ఒత్తిళ్లకు లోనై తమకు అన్యాయం చేస్తున్నారని, తమకు న్యాయం జరిగేంతవరకు పోస్టుమార్టంకు అంగీకరించబోమని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించారు. అదే సమయంలో అనంతపురం డీఎస్పీ టివివి.ప్రతాప్, సిఐలు కనుమూరి సాయినాథ్, నరేంద్ర రెడ్డిలు మతుని బంధువులకు సర్ది చెప్పడానికి ప్రయత్నించారు. ఇన్‌ఛార్జి వార్డెన్ ఈరన్న నిర్లక్ష్యం వల్లనే తమ కుమారుడు మతి చెందాడని, వార్డెన్‌ను సస్పెండ్ చేయాలన్నారు. తాము ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గబోమని, విద్యార్థి మృతి విషయంలో నిష్పక్షపాతంగా విచారణ జరిపి న్యాయం చేస్తామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు పోస్టుమార్టంకు అంగీకరించారు.

ఆరోపణలపై విచారణ చేస్తాం: సిఐ సాయినాథ్

హాస్టల్‌లో ఎలాంటి నిర్లక్ష్యం లేదని, విద్యార్థి మృతి విషయంలో అనుమానాస్పద అంశాలేవీ ప్రాథమిక విచారణలో కనపడలేదని సిఐ సాయినాథ్ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత అందులోని అంశాల ఆధారంగా లోతుగా విచారణ చేస్తామన్నారు. మతుని తల్లిదండ్రులు చేస్తున్న ఆరోపణలపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా విచారణ చేస్తామన్నారు.

మృతుని బంధువులకు సర్ది చెబుతున్న డీఎస్పీ ప్రతాప్

ఆసుపత్రి వద్ద రోదిస్తున్న విద్యార్థి తల్లి రాములమ్మ

సమగ్ర విచారణ చేపట్టాలి : ఎస్‌ఎఫ్‌ఐ

అనంతపురం కలెక్టరేట్ : బిసి సంక్షేమ హాస్టల్లో ఇంటర్ విద్యార్థి తేజ ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిద్ధు, ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు విద్యార్థి తల్లిదండ్రులు ఆత్మహత్యపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. వారి అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా హాస్టళ్లలో అనేక సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. విద్యార్థులకు రక్షణ లేదన్నారు. ప్రతి హాస్టల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, శివ, వంశీ, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు అరవింద్, గణేష్, సోము, హిరణ్య, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

ఐదురోజులు తేలికపాటి వర్షాలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఉభయ అనంతపురం జిల్లాలో రాబోవు ఐదు రోజుల్లో చిరుజల్లుల నుంచి తేలికపాటి వర్షాలు కురవనున్నట్లు మండల కేంద్రంలోని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గరిష్ట ఉష్ణోగ్రత 32.0-35.0 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత 23.0-23.8 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. నైరుతి దిశగా గాలులు గంటకు 10-16 కిమీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. గాలిలో తేమ ఉదయం పూట 68-78 శాతం, మధ్యాహ్నం పూట 54-78 శాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

పారదర్శకంగా ఉద్యోగుల బదిలీలు

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ బదిలీలు - 2024పై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల పరిధిలో ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ఉద్యోగుల బదిలీలు చేపట్టాలన్నారు. నిబంధనలను ఎక్కడా ఉల్లంఘించరాదన్నారు. రోజువారీగా ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ బదిలీల ప్రక్రియను చేపట్టాలని జేసికి సూచించారు. వివరణాత్మకంగా పరిశీలన ఉండాలన్నారు. అన్ని ఖాళీలను ప్రదర్శించాలని తెలియజేశారు. ఈ విషయాలపై సరైన అవగాహన, స్పష్టత ఉండాలన్నారు. ఖాళీలను నోటీస్ బోర్డ్‌లో అతికించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, డిటిసి వీర్రాజు, డిపిఒ ప్రభాకర్ రావు, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి జి.నాగరాజారావు, మైన్స్ డిడి నాగయ్య, పీఆర్ ఎస్ఈ కెవికెవి.ప్రసాద్, డిఎస్ఓ శోభారాణి, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, కలెక్టరేట్ ఏవో జి.మారుతి పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత నుంచి తొలగించాలి

ఉప విద్యాధికారికి యుటిఎఫ్ నేతల వినతి

వినతిపత్రం సమర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలను అప్‌లోడ్ బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తొలగించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా ఉప విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులు, శ్రీదేవిని యుటిఎఫ్ నాయకులు మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేసి బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. ప్రత్యేకించి మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత నుంచి తొలగించాలని గత ప్రభుత్వంపై పోరాటాలు చేశామన్నారు. పోరాటాల ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం మరుగుదొడ్ల ఫొటోలు బాధ్యత నుండి ఉపాధ్యాయులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే ఈ ఫొటోలు ఎస్ఎంసి ఛైర్మన్, సభ్యులు, గ్రామ సచివాలయ అసిస్టెంట్లతో తీయించాలని చెప్పారన్నారు. వారు ఫొటోలు తీయకపోతే ప్రధానోపాధ్యాయులే బాధ్యత వహించాలని చెప్పారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ఈ బాధ్యత నుంచి ఉపాధ్యాయులను తొలగించాలిన కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, నాగేంద్ర, చంద్రమోహన్, ఆదిశేషయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గడ్డితిని బతకాలా..?

తాగునీటి సరఫరా కార్మికుల నిరసన

నార్పలలో పచ్చిగడ్డి తింటూ నిరసన తెలుపుతున్న సత్యసాయి కార్మికులు

ప్రజాశక్తి-నార్పల

నెలల తరబడి వేతనాలు ఇవ్వకుండా గడ్డి తిని బతకాలా అంటూ సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని బి.పప్పూరు పంపుహౌస్ వద్ద చేపట్టిన సత్యసాయి కార్మికులకు చేపట్టిన ఆందోళనలో భాగంగా మంగళవారం 6వ రోజు పచ్చిగడ్డి తింటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూకరువు జిల్లా ప్రజల దాహార్తి తీర్చడానికి సత్యసాయి బాబా ఏర్పాటు చేసిన పథకానికి ప్రభుత్వం నిధులు కేటాయించక పోవడం దుర్మార్గమన్నారు. ఆరునెలలుగా వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలని నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగొచ్చి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నాగభూషణ, అంకన్న, పుల్లానాయుడు, వెంకటరమణ, శరత్‌బాబు, శ్రీరాములు, చంద్రమోహన్, ధనుంజయ పాల్గొన్నారు.

గుత్తి : వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీ సత్యసాయి మంచినీటి ప్రాజెక్టు కార్మికులు చేపట్టిన ఆందోళన మంగళవారం 6వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పట్టణ శివారులో ఉన్న పంప్‌హౌస్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఆరు నెలలగా జీతాలు ఇవ్వకపోతే తాము ఎలా బతకాలన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు వేతనాలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఎం.రామాంజినేయులు, ఎ.రామకృష్ణ, పి.ఎర్రిస్వామి, ఎం.చంద్ర, డి.రాజు, వై.శివప్రసాద్, ఎస్.లక్ష్మీనారాయణ, ఎస్.రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా యుపిఎస్‌సి పరీక్ష

జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

యూపీఎస్సీ నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ-2 కంబైన్డ్ డిఫెన్స్ అకాడమీ-2024 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణపై మంగళవారం నాడు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పరీక్షలను జాగ్రత్తగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. సెప్టెంబర్ 1వ తేదీన అనంతపురం జెఎన్‌టియు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రధాన బిల్డింగ్‌లో కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ -2, 2014 పరీక్ష ఉదయం 9:00 గంటల నుంచి 11:00 గంటల వరకు పేపర్-1 ఇంగ్లీషు పరీక్ష, మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు పేపర్-2 జనరల్ నాలెడ్జ్, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు పేపర్-3 ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ పరీక్షలు జరుగుతాయన్నారు. అదే రోజు అనంతపురం నగరంలోని కెఎస్ఆర్ ప్రభుత్వ యూజీ, పీజీ కాలేజ్ ఫర్ ఉమెన్ కళాశాలలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ ఎగ్జామినేషన్ -2, 2014 పరీక్షలకు సంబంధించి ఉదయం 10:00 గంటల నుంచి 12:30 గంటల వరకు పేపర్-1 మ్యాథమెటిక్స్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4:30 గంటల వరకు పేపర్-2 జనరల్ అబిలిటీ పరీక్షలు జరుగాయన్నారు. పరీక్షలకు మొత్తం 238 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిఎంహెచ్ఓ డా॥ఈబి.దేవి, గ్రౌండ్ వాటర్ డిడి తిప్పేస్వామి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పునరావాసులకు నష్టపరిహారం అందిస్తాం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

చాగల్లు రిజర్వాయర్ వెనుకజలాలకు ముంపునకు గురువుతున్న ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి వాసులకు పునరావాస పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మంగళవారం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా చాగల్లు రిజర్వాయర్ వద్ద జలపూజ చేశారు. అనంతరం ఉల్లికల్లు గ్రామస్తులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తనతోపాటు సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే ముంపు పరిహారం వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఉల్లికల్లువాసులు దశాబ్ధ కాలంపాటు సంక్షేమ, అభివృద్ధి పనులకు దూరమయ్యారన్నారు. ఈనేపథ్యంలో కలెక్టర్‌తో చర్చించి పరిహారంతోపాటు గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బ్రహ్మయ్య, డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, నాయకులు దేగల కృష్ణమూర్తి, మాజీ జెడ్పిటిసి అమ్మలదిన్నె శాలిని, డీలర్ మసూద్‌వలి, కాయగూరల సత్తి, మాసూలు చంద్రమోహన్, బండి వెంకటనారాయణ, చాకలి వెంకటేష్, ఉల్లికంటిపల్లి చలమయ్య, పట్నం నగేష్, గుర్రం లక్ష్మీనారాయణ, బండి పరశురామ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ఇంజనీరింగ్ సెక్షన్ సుధారాణికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు పని భారంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా పదిమంది చేసే పని ఒకరితో చేయించడం వల్ల కార్మికులు అనారోగ్యంతో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పట్టణ ప్రజలకు అనుగుణంగా 200 మంది కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు సకాలంలో పనిముట్లు ఇవ్వాలన్నారు. రెగ్యులర్ కార్మికులకు బకాయి రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ ఇవ్వాలని, యూనిఫారం, కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, కుట్టుకూళ్లు ఇవ్వాలని కోరారు. వీరితోపాటు కోవిడ్, మలేరియా, గార్బేజ్, క్లాప్ ఆటో డ్రైవర్లకు 16 రోజుల సమ్మె పోరాటంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.15వేల వేతనంతోపాటు పిఎఫ్, ఇఎస్ఐ కట్టే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఇకపోతే బుక్కరాయసముద్రం మండలం కేంద్రం సమీపంలోని దేవరకొండ పక్కన మిగులు భూముల్లో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న కార్మికులకు తక్షణమే రెండుసెంట్ల ప్రకారం స్థలం కేటాయిస్తూ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ సెక్షన్ సుధారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, ట్రెజరర్ బత్తల ఆదినారాయణ, నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారి స్వామి, సాకే తిరుమలేష్, ఆదినారాయణ, మహిళా కన్వీనర్ లక్ష్మీనరసమ్మ, ఉపాధ్యక్షులు శశీంద్రకుమార్, ప్రభాకర్, శివ, హిమాంబి, ఇతర సంఘం నాయకులు వెంకటేశు, ముత్తురాజు, ప్రజానాట్య మండలి నాగేంద్ర, పుల్లన్న, కిరణ్, కమల్, కార్మికులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యార్థులను క్రీడాకారులుగానూ మార్చాలి : జెఎన్‌టియు విసి

మాట్లాడుతున్న జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు పరిధిలోని సాంకేతిక విద్యార్థులను క్రీడాకారులుగా తయారు చేయాల్సిన బాధ్యత స్పోర్ట్స్ డైరెక్టర్‌పై ఉందని ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శన్‌రావు సూచించారు. నగరంలోని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఇఇఇ సెమినార్ హాల్‌లో వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జ్యోతిరెడ్డి అధ్యక్షతన అనుబంధ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ల 15వ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విద్యతోపాటు క్రీడలు, యోగాలో ప్రతిభ కనబరచాలని సూచించారు. ప్రతి విద్యార్థి రోజూ క్రీడా మైదానంలో ఉండే విధంగా ఫిజికల్ డైరెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉపకులపతిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి.జోజిరెడ్డి, డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి, వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే అస్మిత్

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలంలోని ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని సింగనగుంట పల్లి, తబ్జుల, చాగల్లు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా సింగనగుంటపల్లిలో పలువురు తమకు ఇళ్ల బిల్లులు రాలేదని, పునరావాసం పరిహారం అందజేయాలని కోరారు. అలాగే తబ్జుల, చాగల్లు గ్రామాల్లో పలువురు పలు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీలైనంత తర్వగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామకృష్ణ, తహశీల్దార్ బాలాజీరాజ్, ఎంఇఒలు శ్రీదేవి, ఓబుళపతి, ఇంజనీర్ ప్రసన్నకుమార్, సీనియర్ టిడిపి నాయకులు రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, యువ నాయకులు లోక్‌నాథ్‌రెడ్డి, సర్పంచులు గంగమ్మ, లలిత, నాగరాజు, వీరన్న గారి నాగరాజు, శంకర, ప్రతాప్‌రెడ్డి, కుసుమారెడ్డి, పెద్దిరెడ్డి, ఓబిరెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

అర్హులందరికీ బిందుసేద్యం పరికరాలు

ఎపిఎంఐపి ఏపీడీ ఫిరోజాఖాన్

ప్రజాశక్తి-కణేకల్లు

జిల్లాలోని అర్హులైన రైతులందరికీ బిందుసేద్యం పరికరాలు మంజూరు చేయనున్నట్లు ఎపిఎంఐపి ఎపిడి ఫిరోజాఖాన్ తెలిపారు. శనివారం మండలంలోని హులికెర గ్రామంలో పర్యటించి రైతు ధనుంజయ పొలంలో ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. అనంతరం రైతు సేవాకేంద్రాన్ని సందర్శించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 37,500 హెక్టార్లకు బిందుసేద్యం పరికరాలు అందిచేందుకు లక్ష్యం కేటాయించినట్లు వెల్లడించారు. జైన్ కంపెనీతోపాటు 27 కంపెనీలకు బిందుసేద్యం పరికరాల సరఫరాకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. అనంతరం 25 మంది రైతులకు రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో హులికెర గ్రామ రైతులు నాగేష్‌రెడ్డి, పురుషోత్తం, ఆదినారాయణ, బసవరాజు, విజయ్, బుజ్జి, రవిచంద్ర, బాబు, ధనుంజయ, శ్రీనివాసులు, జైన్ కంపెనీ జిల్లా ప్రతినిధి అవినాష్ సోనావే, జైన్ కంపెనీ డీలర్ సందీప్‌కుమార్, కంపెనీ ప్రతినిధి మారుతి, మైక్రో ఇరిగేషన్ అధికారులు లక్ష్మీనారాయణ, మల్లేష్, సాయిరామ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

5న తిరుపతి సిఎండి కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యుత్‌రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమానపనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 5వతేదీన తిరుపతి లోని సీఎండీ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని కార్మికులు పెద్దఎత్తున జయప్రదం చేయాలని సిఐటి యు నగర 1వ కమిటీ కార్యదర్శి వై.వెంకట నారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని పవర్ ఆఫీస్ వద్ద యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యుత్‌రంగం కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, దుర్గ కాలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మధు, స్కావెంజర్స్ అటెండర్స్ రాము, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే జయరామ్

ప్రజాశక్తి-గుత్తి

గుంతకల్లు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడతామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంత టిడిపి కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకుంటామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలానికి ఉపాధి హామీ పథకం కింద రూ.3 కోట్లు చొప్పున నిధులను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ, బర్దివలి, ఎంకె.చౌదరి, కోనంకి కృష్ణ, సొలమన్ రాజా, చికెన్ శీనా, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

పట్టణంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని మన్రో సత్రం నుంచి కొత్తపేట గ్రామంలో ఉన్న శ్రీకృష్ణ మందిరం వరకూ శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, యాదవ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ వేషధారితో ఎమ్మెల్యే జయరామ్

కుష్టువ్యాధి అపోహలపై అవగాహన కల్పించాలి

మాట్లాడుతున్న డాక్టర్ అనుపమ జేమ్స్

అనంతపురం : గ్రామాల్లో కుష్టువ్యాధిపై ప్రజలకు ఉన్న అపోహలపై అవగాహన కల్పించాలని కుష్టువ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లాలోని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లకు నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుష్ఠ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహించిన సర్వేలో 63 కొత్త కేసులను గుర్తించామన్నారు. వారికి మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రాథమిక దశలోనే కుష్టువ్యాధిని గుర్తించడం ద్వారా ప్రజలకు రోగం నుంచి పూర్తిగా దూరం చేయవచ్చన్నారు. ఈ సమావేశంలో సిబ్బంది డాక్టర్ శివారెడ్డి, పారామెడికల్ అధికారి నాగన్న, హెచ్ఇఒ సత్యనారాయణ, పారామెడికల్ అధికారులు రాముడు, తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు

బ్రహ్మసముద్రం : రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లను మంగళవారం తొలగించినట్లు ఇఒఆర్‌డి వెంకట్‌నాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బ్రహ్మసముద్రం బస్టాండ్ వరకూ రోడ్లుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, టిడిపి నాయకులు గొంచికారి శివారెడ్డి, ఉన్నత పాఠశాల స్కూల్ కమిటీ ఛైర్మన్ అల్లాబకాష్, ఐటిడిపి మండల కో ఆర్డినేటర్ లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా మా కక్షి దారుడయిన షేక్ జిలాని బాషా తండ్రి:లేట్ షేక్ ఇమామ్ సాహెబ్, డోర్ నెం.12-1-815, అశోక్ నగర్, అనంతపురం గారికి హక్కు అనుభవం గల ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని ఏ బ్యాంకులోనైన ఆయకం వుంచి ఋణమును పొందవలెనని అనుకున్నారు. అయితే ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ పత్రం డాక్యుమెంటు నెం:5855/1984 తేది:31-05-1984 షేక్ జిలాన్ బాషా తండ్రి లేట్ షేక్ ఇమామ్ సాహెబ్ అనంతపురం గారి పేరుతో ఉన్న ఒరిజినల్ పత్రం అనంతపురం రుద్రంపేట దగ్గర జిరాక్స్ సెంటర్ నందు పోగొట్టుకొని పోయినది. ఈ విషయము అనంతపురం 4వ పట్టణ పోలీసు స్టేషన్ నందు ఫిర్యాదు చేసి వారి నుండి ఒక సర్టిఫికెట్ పొంది వున్నామని తెలిపి యున్నారు. కావున తమ వద్ద ఒరిజినల్ పత్రం నకలు మాత్రమే వున్నదని తెలిపి యున్నారు. కావున ఎవరికైన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని గురించి గాని సదరి పత్రం గురించి గానీ ఆక్షేపణలున్నచో ఈ క్రింది ప్రకటన వెలువడిన 10 రోజుల లోపల మాకు తెలుపుగోరుచున్నాము.

షెడ్యూలు

అనంతపురం రి॥డి॥ అనంతపురం సబ్॥డి॥కి చేరిన కక్కలపల్లి గ్రామ పొలం రుద్రంపేట పంచాయితీ ఏరియా లోని ఆస్తి వివరం.

బాబు వివరం:సర్కారుఖుష్కి, **సర్వే నెం:**154, **ఎ.సి:**8.00 పైకి, **ఎ.సి:**0.05, **హెచ్.యస్:**0.020, **ప్లాటు నెం:**60, ఈ పైకి, **ఎ.సి:**0.02 1/2, **హెచ్.యస్:**0.010,

చెక్కుబంది: తూర్పు:తిమ్మారెడ్డి భూమి, **దక్షిణం:**పి.కాశింపీరా భూమి, **పడమర:**రోడ్డు, **ఉత్తరం:**ప్లాటు నెం:59.

A.SURESH KUMAR,
Advocates, Anantapuramu, Cell:9440204098

మెడికల్ రెప్స్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మెడికల్ సేల్స్ రెప్రజెంటీవ్‌లకు చట్టబద్ధమైన విధానాలు అమలు చేయాలని మెడికల్ రెప్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన సహాయ కార్యదర్శి మనోహర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అమర్నాథ్, రామంజినేయులు డిమాండ్ చేశారు. మంగళవారం మెడికల్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ వివినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మెడికల్ రెప్‌లు

పనుల నాణ్యతను ప్రశ్నిస్తే బెదిరింపు

కాంట్రాక్ట్ వర్క్ఇన్‌స్పెక్టర్‌పై భౌతికదాడికి యత్నం-సబ్‌కాంట్రాక్టర్‌పై డిఇఇ ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో పనులను నాణ్యతను ప్రశ్నించిన అధికారులపై గుత్తేదారులు బెదిరింపులకు దిగుతున్నారు. ఇలాంటి ఘటనే 50వ డివిజన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. 50వ డివిజన్ పరిధిలోని అరుణోదయ కాలనీ పార్కులో వాకింగ్ ట్రాక్ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల పరిశీలన నిమిత్తం వర్క్ఇన్‌స్పెక్టర్ రామాంజినేయులు మంగళవారం ఉదయం వెళ్లారు. పనులు నాణ్యతగా లేవని, అసంపూర్తిగా ఉన్న పనులను ముందు పూర్తి చేసి తర్వాత కొత్త వాటిని చేయాలని సూచించారు. అధికారి ఈ మాటలు చెబుతుండగానే పనులను దక్కించుకున్న సబ్ కాంట్రాక్టర్ నారాయణస్వామి సమక్షంలోనే బేల్దారి పనిని సక్రమంగా చేయకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ క్రమంలో అక్కడున్న ఓ బేల్దారి అసభ్య పదజాలంతో వర్క్ ఇన్‌స్పెక్టర్‌పై భౌతిక దాడికి యత్నించారు. 'బొచ్చులో వర్క్ త్వరగా పనులు ముగించండి.. నీదేంది రా కథ.. నీ రుబాబు ఎక్కువైంది'. అంటూ దాడికి యత్నించాడు. వెంటనే వర్క్ఇన్‌స్పెక్టర్ ఈ విషయాన్ని డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రవీంద్రారెడ్డికి ఫోన్ ద్వారా తెలియాజేశారు. డిఇఇ అక్కడికి చేరుకుని పనులను చేయిస్తున్న సబ్ కాంట్రాక్టర్‌ను మందలించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించడానికి ఇంజినీరింగ్ వర్కర్లు ఉన్నారని, వారిని బెదిరించటం దాడికి పాల్పడటం సరికాదని హెచ్చరించారు. అధికారులపై ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని ఎవరినీ ఉపేక్షించమని స్పష్టం చేశారు. అవసరం అయితే అభివద్ధి పనులను నిలిపివేసి నిరసన తెలుపుతామన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగే అభివద్ధి పనుల పర్యవేక్షణను ఇంజినీరింగ్ అధికారులు గాలికి వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వర్క్ ఇన్స్‌పెక్టర్లు పనుల నాణ్యతను అడిగినా పట్టించుకునే వారు కరువయ్యారు. దీనికి తోడు కాంట్రాక్టర్లు టెండర్లలో పనులు దక్కించుకోవడంలో చూపుతున్న శ్రద్ధను పనుల నాణ్యత విషయంలో చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. పనుల టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు సబ్ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. సబ్ కాంట్రాక్టర్లు వారు చేస్తున్న పనుల్లో డబ్బులు మిగుల్చుకునేందుకు నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. దీనికి తగ్గట్టుగానే అప్పటి కమిషనర్ మేఘ స్వరూప్ అసిస్టెంట్ ఇంజినీర్లకు బదులుగా వార్డు అమ్యూనిటీలకు డివిజన్లను కేటాయించి అసిస్టెంట్ ఇంజినీర్లకు పనులు లేకుండా చేశారు. ఈ గందరగోళంతో పనుల నాణ్యతను పూర్తి స్థాయిలో పరిశీలించే వారు కరువయ్యారు. ఇలాంటి సమయంలో ఎవరైనా అధికారులు నాణ్యతను ప్రశ్నిస్తే గుత్తేదారులు ఎదురు ప్రశ్నించడం జరుగుతోంది. ఇలాంటి వాటిపై ఉన్నతాధికారులు స్పందించి అభివద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీపడకుండా కాంట్రాక్టర్లు చేత చేయించాలని నగరవాసులు కోరుతున్నారు.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డిఇఇ

రైతులు పంటల సరళిని మార్చాలి

అనంతపురం ఎడిఎ ఎం.రవి

ప్రజాశక్తి-అనంతపురం

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు కూడా పంటల సరళి మార్చాలని అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ ఎం.రవి సూచించారు. సోమవారం కందుకూరు గ్రామ రైతు సేవాకేంద్రంలో అగ్రికల్చర్ టెక్నాలజీ మిషన్ (ఆత్మ) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులు కనుగుణంగా ఏఏ పంటలను సాగు చేయాలి.. ఎలాంటి అధిక దిగుబడినిచ్చే పంటలను సాగు చేయాలనే విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే కాలానికి అనుగుణంగా రైతులు పంటలు సాగు చేస్తూ ప్రతి రైతు ఒక శాస్త్రవేత్తగా తయారు కావాలని ఆకాంక్షించారు. ఇకపోతే వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటలు సాగు చేయని రైతుల సౌకర్యార్థం రైతుసేవా కేంద్రాల్లో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం వేరుశనగ, ఆముదం పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ, వ్యవసాయ విస్తరణ అధికారి బి.మురళీకృష్ణ, ఆత్మ ఏటీఎం అనురాధ, కందుకూరు రైతు సేవాకేంద్రం స్టాఫ్ అపర్ణ, రైతులు వెంకటస్వామి, రాగే మల్లేష్, బాలకృష్ణ, ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, శివయ్య, ఆదెప్ప పాల్గొన్నారు.

వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎడిఎ ఎం.రవి

హెచ్ఐవిపై అవగాహన

గుత్తి : పట్టణంలోని పద్మవాణి ఉన్నత పాఠశాలలో హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన టిఐ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఐసిటిసి కౌన్సిలర్ వెంకటేశులు, టిఐ ప్రాజెక్ట్ మేనేజర్ జి.రమేష్ హెచ్ఐవి రాకుండా ఉండేందుకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మవాణి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బాబా ఫక్రుద్దీన్, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ టిఐ ప్రాజెక్టు సిబ్బంది సందీప్‌కుమార్, ఏఎన్ఎం ఎన్.కవిత, ఓఆర్‌డబ్ల్యులు డి.కృష్ణవేణి, జి.రాధాకుమారి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

వజ్రకరూరు : ఉరవకొండ పట్టణంలోని పార్క్ ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో మృతిచెందిన అనాథ మృతదేహానికి ఆపద్బాంధవ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర ట్రస్ట్ అధ్యక్షులు నర్రా కేసన్న, ఆపద్బాంధవ ట్రస్ట్ అధ్యక్షులు వేల్పుల మురళి, నూర్‌బాషా, నవీన్, భీమేష్, అశోక్, బెల్గల్ బాషా, రమేష్, స్థానికులు ఎర్రస్వామి, నవత, తిప్పయ్య, సుదర్శన్, దస్తగిరి, పారిశుధ్య కార్మికులు, పాల్గొన్నారు.

కెజిబివికి ఫ్యాన్లు వితరణ

వజ్రకరూరు : విడపనకల్ మండల పరిధిలోని మాలాపురంలో ఉన్న కేజిబివి పాఠశాలకు పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్ ఎ.ఈశ్వరమ్మ, వన్నూరుస్వామి దంపతులు మంగళవారం 10 సీలింగ్ ఫ్యాన్లను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు రాజా, ప్రసాదరావు, ప్రిన్సిపాల్ తులసీప్రియ, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

కణేకల్లు : స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏవో శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పంటకోత ప్రయోగాలకు సంబంధించిన విధివిధానాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉరవకొండ ఏఎస్ఒ మండల ఇన్‌ఛార్జి హేమావతి మాట్లాడుతూ ఖరీఫ్-2024 సీజన్ సంబంధించి పంటకోత ప్రయోగాలు జనరల్ కింద 62 ప్రయోగాలు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం, గ్రామ యూనిట్ కింద కంది పంటకోత ప్రయోగాలు నిర్వహించాల్సి ఉందన్నారు. జనరల్ యూనిట్ కింద వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, సజ్జ, పొద్దుతిరుగుడు పంటల్లో నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద కంది పంటలో నిర్వహించే కోత ప్రయోగాల వల్ల బీమా రేటును నిర్ణయించనున్నట్లు తెలిపారు.

ఎస్సీ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

వజ్రకరూరు : ఉరవకొండలోని ఎస్సీ హాస్టల్ వార్డెన్ జగన్నాథ్‌ను సస్పెండ్ చేయాలని జివిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే పురుషోత్తం, ఆర్ఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. మంగళవారం ఉరవకొండలోని ఏఎస్‌డబ్ల్యూఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డెన్ మెనూ ప్రకారం భోజనం అందించకుండా మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే నాసిరకమైన కూరగాయలు, ఆకుకూరలను తీసుకువచ్చి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఇసుక రవాణా చేసి నాకు దూరం కావొద్దు..

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి



ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి నియోజకవర్గంలో అక్రమంగా ఇసుక రవాణా చేసి తనకు దూరం కావొద్దని మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. చికిత్స అనంతరం హైదరాబాదులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఓ వీడియో ద్వారా తమ సందేశాన్ని పంపారు. టిప్పర్ యజమానులు నియోజకవర్గంలో అక్రమ రవాణా పాల్పడినట్లు తెలిస్తే ఎక్కడున్నా టిప్పర్లను సీజ్ చేయిస్తానన్నారు. గతంలో ఇసుక అక్రమ రమాణాపై గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు, హైకోర్టులకు వెళ్లాలని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో మాదిరిగానే ఇసుక అక్రమ రవాణా పాల్పడం సరైన విధానం కాదన్నారు. మీరందరూ తనకు కావాల్సిన వారే అన్నారు. ఐదేళ్లుగా కష్టాలకు ఓర్చుకుని తన వెంట నడిచారన్నారు. అయితే అందరికీ న్యాయం చేస్తా.. అక్రమంగా ఇసుక రవాణాకు మాత్ర పాల్పడకండి మానుకోండని సూచించారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పథకాలు సాధించిన విద్యార్థులు

బుక్కరాయసముద్రం : శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల జూనియర్ సాఫ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా పురుషుల జట్టు తృతీయ స్థానం సాధించింది. ఇందులో బుక్కరాయసముద్రం విద్యార్థులు చరణ్ తేజ, నవనీత్, అజయ్, గణేష్, అరవింద్‌రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలితమ్మ, నీలకంఠారెడ్డి, గంగాధర్, ఆనంద్, నాగరాజుగౌడ్, శారదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

అనంతపురం కలెక్టరేట్ : మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రుద్రంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అనంతపురం అధ్యక్షులు శీలా జరామప్ప, కార్యదర్శి గంగిరెడ్డి, సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమంగళి, ఉపాధ్యాయులు, గురివిరెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి మృతికి కారణమైన డాక్టర్‌పై చర్యకు డిమాండ్

కణేకల్ : చిన్నారికి సరైన వైద్య చికిత్సలు అందించకుండా మృతికి కారణమైన మండలంలోని ఎర్రగుంట ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న డాక్టర్ విజయకుమార్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి కోరి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాలుగు రోజుల నుంచి విద్యార్థినికి వైద్యం అందిస్తున్న డాక్టర్ విజయకుమార్ పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మెరుగైన వైద్యం కోసం వేరే ఆసుపత్రికి పంపకుండా తానే వైద్యం చేస్తానని చెప్పడంతో విద్యార్థిని ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. జిల్లా వైద్యాధికారులు తక్షణమే స్పందించి విద్యార్థిని మృతికి కారణమైన డాక్టర్ విజయకుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

మాట్లాడుతున్న మండల వైద్యాధికారిణి గౌతమి

గార్లదిన్నె : గ్రామ, మండల స్థాయిలో హెల్త్‌క్లినిక్‌లు నిర్వహిస్తున్న ఆర్ఎంపి, పిఎంపిఎస్‌లు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ గౌతమి సూచించారు. కలెక్టర్, డిఎంహెచ్ఓ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మండలంలోని ఆర్ఎంపి, పిఎంపిఎస్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేమ్‌బోర్డు మీద ప్రథమ చికిత్స కేంద్రం, ఫస్ట్ ఎయిడ్ సెంటర్ అని మాత్రమే రాసుకోవాలన్నారు. ఎవరూ డాక్టర్ అని పెట్టుకోకూడదన్నారు. ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ఎలాంటి ద్రావణాలు, సూది మందులు, యాంటిబయోటిక్స్, ఐవి ఫ్లూయిడ్స్, ఇంజెక్షన్లు, స్టెరాయిడ్స్, మైనర్ సర్జరీస్, అబార్షన్స్ వంటిని చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో గార్లదిన్నె వైద్యులు గౌతమి, ఎర్రగుంట్ల వైద్యులు దిలీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

కోతకు గురైన రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైన సూగేపల్లి కోనాపురం వెళ్లే ప్రధాన రహదారికి అధికారులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ప్రజాశక్తిలో దినపత్రికలో ఇటీవల 'సూగేపల్లి రహదారి ధ్వంసం' అన్న కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు సర్పంచి వనిత మల్లికార్జున స్పందించి జెసిబి, ట్రాక్టర్‌తో మట్టి తోలి రోడ్డును మట్టి వేసి చదును చేశారు.

రహదారికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

'ఉపాధి' సామాజిక తనిఖీ ప్రజావేదిక

తాడిపత్రి రూరల్ : మండలంలోని 26 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 ఆర్థిక సంవత్సరానికి రూ.7.48 కోట్ల ఖర్చుతో వివిధ రకాల పనులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పలు బృందాలతో డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలు, వీఎస్‌లు గ్రామాల్లో పనులను తనిఖీ చేశారు. పనుల్లో అవకతవకలను వెల్లడించారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఒ మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో భాగంగా రూ.89,906 రికవరీకి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రంగరావు, ఏపీవో నరేంద్ర, విజిలెన్స్ అధికారులు, డీఆర్పీలు, సాంకేతిక సహాయకులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యామ్నాయ' విత్తనాలకు నమోదు చేసుకోండి

గార్లదిన్నె : పంటలు సాగు చేయని రైతులు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

29న 5కె రెడ్‌రన్

అనంతపురం : ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 29న 5కె రెడ్‌రన్ మారథాన్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈమారథాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోజు ఉదయం 6.30 గంటలకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమయ్యే రన్ టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, సర్వజన ఆసుపత్రి, కోర్టు రోడ్డు మీదుగా తిరిగి ఆర్ట్స్ కళాశాలకు చేరుకుంటుందన్నారు.

29న షూటింగ్ క్రీడా పోటీలు

అనంతపురం : స్థానిక ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 29న ఓపెన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్టు ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ సెక్రటరీ శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ సైట్, ఎయిర్ రైకల్ పీప్ సైట్, పిస్టల్ విభాగంలో పోటీలు ఉంటాయన్నారు.

రేపు ఎస్ఎంసి ఎన్నికలు

నార్పల : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 29న మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కోరం లేక రెండుసార్లు ఎన్నికలు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అధికారుల ఆదేశాల మేరకు రేపు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తప్పుడు ప్రచారం తగదు

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

డి.హీరేహాల్ : ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తోపాటు తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం తగదని టిడిపి మండల కన్వీనర్ హనుమంతురెడ్డి అన్నారు. ఇటీవల వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న 'అప్పులు తీర్చడానికి దోపిడీకి సహకరించండి' అని పెట్టిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగమనేని సుబ్బయ్య చౌదరి పేరుతో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులకు రూ.25 కోట్లు అప్పు ఉంది.. అప్పు తీర్చడానికి దోపిడీ చేసేందుకు ఎమ్మెల్యే సహకరిస్తున్నారని ప్రచారం చేయడం బాధాకరమన్నారు. వెంటనే అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు నాగలి రాజు, ఎంపిటిసి మల్లికార్జున, బోయ నాగ, మకాశి వెంకటేశులు, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు

బొమ్మనహాల్ : శ్రావణమాసం మంగళవారాన్ని పురస్కరించుకుని మండలంలోని నేమకల్ గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయమే స్వామివారికి సన్నీటి స్నానాలు ఆచరించి రాగి కవచం ధరించారు. తర్వాత తమలపాకుల పూజ, పుష్ప, కుంకుమ అర్చనలు, అభిషేకాలు చేశారు. స్వామివారి దర్శనార్థం ఇచ్చిన భక్తులకు ప్రత్యేక దర్శనం ఉచిత దర్శనం వారితోపాటు ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు నరసింహారెడ్డి తెలిపారు

ఉదయాన్నే పింఛన్లు పంపిణీ చేయాలి

పుట్లూరు : వచ్చేనెల 1వ తేదీన ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ మొదలు పెట్టాలని ఎంపిడిఒ ఎంపిడిఒ యోగానందరెడ్డి సూచించారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సచివాలయ ప్రత్యేక అధికారులు, పెన్షన్ పంపిణీ చేసే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ మొదలు పెట్టి అదేరోజు 99 శాతం పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, ఎటిఎం వెంకట్రామిరెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల (బాలికలు) పాఠశాలను డిప్యూటీ డిఎంహెచ్ఓ రాజేష్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వంటగది, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. తర్వాత భోజనశాల, వంట గదులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట చేసే మనషులు వంటకు ముందు.. వంట చేసే సమయంలో తప్పకుండా చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సౌభాగ్య లక్ష్మి, ఏఎన్ఎం రామలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి ఉపేంద్ర, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు వినతి

రాయదుర్గం : నియోజకవర్గంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని స్టీల్‌ప్లాంట్ సాధన సమితి అధ్యక్షుడు బిఎం నాదల్ కోరారు. మంగళవారం విజయవాడలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గంలో విరివిగా ఇనుప ఖనిజం గనులు ఉన్నాయన్నారు. కావున ఉంతకల్లు వద్ద త్వరలో రిజర్వాయర్ నిర్మించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో అనేకమంది నిరుద్యోగులు ఉన్నారని, స్థానికంగా ఉన్న ఇనుప ఖనిజం, నీటి వనరుల ఆధారంగా ఇక్కడ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు కేంద్రమంత్రి స్పందిస్తూ కేంద్ర ఇనుం ఉక్కు ఘనుల శాఖ మంత్రి కుమారస్వామి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి ప్రయివేటు రంగంలోనైనా ఇనుము ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వసంత్‌శెట్టి తదితరులు ఉన్నారు.